ఆంధ్రప్రభ సచిత్రవార పత్రికలో
1991 లో ప్రచురించబడి
విశేష ప్రజాదరణ పొందిన
మిస్టరీ నవల

రచయిత:
పసుపులేటి తాతారావు

# యాదృచ్ఛికం

(గత సంచిక తరువాయి భాగం..)

"సార్ మన బళ్ళు మారినట్టున్నాయి. పొరపాటున మాది వేసుకొచ్చేసారు మీరు" అన్నాడు.

అది కూడా వాళ్ళు కావాలని చేసిన పనే అని గ్రహించిన ఆ వ్యక్తి అమృతేష్ వైపు కోపంగా చూసి తన వాహనాన్ని తీసుకుని వెళ్ళిపోయాడు.

అమృతేష్ ఇంటర్వ్యూ జరిగే చోటుకి వెళ్ళాడు. తన వంతు రాగానే లోపలికి వెళ్ళాడు. ఇంటర్వ్యూ బోర్డ్ మెంబర్స్ ముగ్గురూ కూర్చుని ఉన్నారు. వాళ్ళలో మధ్యన కూర్చున్న వ్యక్తిని చూసి అమృతేష్ నిశ్చేష్టుడయ్యాడు.

కొన్ని గంటల క్రితం ఏ వ్యక్తినైతే తాను సరదాగా అల్లరి పెట్టాడో ఆ మతిమరపు మాస్టార్ ఇప్పుడు తనని ఇంటర్వ్యూ చేయబోయే వ్యక్తి !

"ప్లీజ్ బీ సీటెడ్"

"థాంక్యూ సర్" అని కూర్చున్నాడు అమృతేష్.

పేరేమిటి, ఊరేమిటి లాంటి సాధారణ ప్రశ్నలతో ఇంటర్వ్యూ మొదలైంది.

"ప్రపంచంలోకెల్లా ఎత్తైన శిఖరం ఏది ?" అడిగాడొక మెంబర్.

"పాఠ్య పుస్తకాల ప్రకారం ఎవరెస్ట్. ఈ మధ్య జరిగిన కొత్త పరిశోధనల ప్రకారం అయితే కే.టూ. శిఖరం" అని చెప్పాడు అమృతేష్.

బోర్డ్ మెంబర్స్ ముగ్గురూ ముఖముఖాలు చూసుకున్నారు.

"ప్రపంచంలోకెల్లా లోతైన సముద్రం ఏది ?" మరొక మెంబర్ అడిగాడు.

ఉదయం జరిగిన సంఘటన వల్ల తన ఎన్నిక జరగదని అమృతేష్‌కు తెలుసు. అందుకే సమాధానం తెలిసున్నా కావాలనే మరోలా చెప్పాడు "దుఃఖ సముద్రం" అని.

"వ్వాట్ ?" ఆశ్చర్యంగా అడిగాడు మెంబర్.

"అవును సార్. ఈ ప్రపంచంలో ఎంత ప్రయత్నించినా లోతు కనుక్కోలేని సముద్రం దుఃఖ సముద్రం ఒక్కటే. దాని ముందు పసిఫిక్‌లూ, హిందూ మహాసముద్రాలు చెరువుల్లాంటివే."

ఈసారి "ప్రపంచపు ఎనిమిదో వింత ఏమిటి" అని మతిమరుపు మాస్టారే అడిగాడు.

"యాదృచ్ఛికం" అని చెప్పాడు అమృతేష్.

సభ్యులు ముగ్గరూ చిత్రంగా చూసారు. "మేము అడిగేది ప్రపంచపు ఎనిమిదో వింత" అన్నాడు.

"ఎస్ సార్. నేను చెప్పేదీ అదే. యాదృచ్ఛికాన్ని మించిన వింత ఈ లోకంలో మరొకటి లేనేలేదు. ఏ సూత్రానికీ కట్టు బడక పోయినా, ఒకేలా జరిగే కొన్ని విచిత్ర సంఘటనలు వింత కాక ఏమవుతాయి సర్ ?" అన్నాడు అమృతేష్.

"ఉదాహరణ పూర్వకంగా వివరంచ గలరా ?" మతిమరపు మాస్టారే అడిగాడు.

"తప్పకుండా" అని చెప్పడం ప్రారంభించాడు అమృతేష్. "కెనడాలో 1986 సెప్టెంబర్ 9న 'నటాలీ లెంకెవిచ్' అనే ఆవిడ తన భర్తతోనూ, మరో ఇద్దరు వ్యక్తులతోనూ 'బ్రిడ్జ్' ఆట ఆడుతోంది. ఆమె ముక్కలు పంచగా అందరికీ ఒకే రంగు ముక్కలు పడ్డాయి. అంటే ఒకరికి పదమూడు ఇస్పేట్లు, మరొకరికి పదమూడు ఆఠీన్లు, ఒకరికి పదమూడు డైమన్లూ, మరొకరికి పదమూడు కళావర్లు అన్నమాట. కలిపిన పేకముక్కలు ఆ క్రమంలో పడడానికి అవకాశం ఎంత తక్కువో మీకు తెలీంది కాదు కదా. అయినా పడ్డాయి – యాదృచ్ఛికంగా.

"అలాగే కొన్ని సంవత్సరాల క్రిందట అమెరికాకు చెందిన "జార్జి డి బ్రైసన్" అనే వ్యక్తి ఒకసారి సెయింట్ లూయీస్ నుంచి న్యూయార్క్ వెళ్ళే ప్రయాణంలో మధ్యలో ఏదో పనిమీద 'లూయీస్ ఎల్లీ కెంటకీ' అనే ఊళ్ళో దిగి ఒక హోటల్‌లో బస చేసాడు. హోటల్లో అతనికి దొరికిన రూమ్ నంబర్ 307. అతనా ఊరికి ఇదివరకెప్పుడూ వచ్చి ఉండలేదు. హోటల్లో దిగిన రోజునే అతను వరండా చివరనున్న ఉత్తరాల విభాగానికి వెళ్ళి వేళాకోళానికన్నట్టు తన పేరు చెప్పి ఉత్తరాలేమైనా ఉన్నాయా ? అని అడిగాడు.

"చాలా చిత్రంగా అక్కడ పనిచేసే అమ్మాయి ఒక కవర్ తీసి అతని చేతికి అందించింది. దాని మీద పేరు చూసాడు. 'జార్జి డి బ్రైసన్' అని ఉంది. రూమ్ నెంబర్ కూడా అదే – 307. ఆశ్చర్యంతో అతనికి మతి పోయింది. ఆ తరువాత తెలిసిందేమిటంటే, అతను రాక ముందు అదే హోటల్లో అదే రూమ్‌లో "జార్జి డి బ్రైసన్" అనే పేరుగల మరొక ఆయన ఉండి వెళ్ళాడట. ఇది కూడా యాదృచ్ఛికంగా జరిగిందే తప్ప మరేం కాదు."

బోర్డ్ మెంబర్స్ ఆశ్చర్యంగా చూసారు. వాళ్ళకు ఆసక్తిగా ఉందని గ్రహించిన అమృతేష్ మరొక ఉదాహరణ చెప్పసాగాడు.

"1900 సంవత్సరంలో ఇటలీ రాజు కింగ్ అంబర్టో తన ఆంతరంగికునితో ఒకరోజు చిన్న పట్టణానికి వెళ్ళాడు. అక్కడ ఇద్దరూ కలిసి ఒక రెస్టారెంట్‌కు వెళ్ళాడు. ఆ రెస్టారెంట్ ఓనర్‌ని చూసి ఆశ్చర్యపోయాడు. కారణం రాజుకు, ఆ ఓనర్‌కూ రూపంలో చాలా పోలికలున్నాయి. రూపంలోనే కాకుండా ఇంకా చాలా విషయాల్లో కూడా వాళ్ళిద్దరికీ పోలికలున్నాయని తెలిసి మరింత ఆశ్చర్యపోయారు.

"ఇద్దరూ ఒకే ఊళ్ళో ఒకే రోజున, ఒకే సంవత్సరంలో (మార్చి 14, 1844) పుట్టారు. ఇద్దరి పేర్లూ 'అంబర్టో'నే. ఇద్దరూ ఒకే రోజున పెళ్ళి చేసుకున్నారు (ఏప్రిల్ 22, 1868). ఇద్దరి భార్యల పేర్లూ 'మార్గరేటా'నే. ఇద్దరూ తమ కొడుకులకు 'వితోరియో' అనే పేరునే పెట్టారు. రాజు, అంబర్టో పట్టాభిషేకం నాడే రెండో అంబర్టో తన రెస్టారెంట్‌ని స్థాపించాడు. వాళ్ళిద్దరూ 1866లో ఒకసారి, 1870లో ఒకసారి ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకుగానూ సన్మానాన్ని పొందారు.

"ఓనర్ అటు వెళ్ళగానే రాజు తన ఆంతరింగికునితో "ఆ వ్యక్తిని రేపటి రోజుకంతా ఇటలీ సింహాసనానికి సర్వాధికారిగా చేయాలనుకుంటున్నాను. అతను తప్పకుండా వచ్చేలా చూడు" అన్నాడు.

"కానీ ఆ మరునాడే రెస్టారెంట్ యజమాని ప్రమాదవశాత్తూ కాల్పుల్లో మరణించాడని రాజు తెలుసుకుని అంత్యక్రియలు జరిగే చోటెక్కడో కనుక్కోమని పురమాయించాడు, తాను వెళ్ళేందుకు. కానీ సరిగ్గా అదే క్షణంలో ఎవరో అతని మీద హత్యాప్రయత్నం చేసారు. కాల్చిన మూడు గుళ్ళల్లో ఒకటి తప్పిపోయినా మిగిలిన రెండూ రాజు గుండెల్లోంచి దూసుకు పోయాయి. అక్కడే మరణించాడు.

"ఇవే కాదు. ముఖ్యమైన సంఘటనలన్నీ మంగళవారం నాడే సంభవించడం మన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిగారి జీవితంలో యాదృచ్ఛికం అయితే, ఏది జరిగినా రెండేసి సార్లు జరగడం మహాకవి శ్రీశ్రీ గారి జీవితంలో యాదృచ్ఛికం. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో. ఎన్నెన్నో."

"ఇవన్నీ మీకెలా తెలుసు ?" అడిగాడొక మెంబర్.

"అన్నీ పత్రికల్లో చూసి చదివినవే. ఎటొచ్చీ నా జీవితం కూడా అలాంటిదే కాబట్టి అన్నీ గుర్తుండి పోయాయి. ఉదయం మిత్రులతో కలిసి సరదాగా అల్లరి చేసిన వ్యక్తే ఇప్పుడిక్కడ ఇంటర్వ్యూ బోర్డ్ మెంబర్‌గా ప్రత్యక్షమవడమే అందుకు నిదర్శనం. ఇప్పుడు చెప్పండి సార్. ప్రపంచపు ఎనిమిదో వింతగా ఉండడానికి యాదృచ్ఛికానికి మించిన అర్హత మరింక దేనికుంది ?"

ఇంటర్వ్యూ అయిపోయింది. సితారని కలిసినప్పుడు ఈ సంగతి ఆమెతో చెప్పాడు. ఆమె చాలా బాధ పడింది. ఇంటర్వ్యూ చేసేది తన బాబాయే కాబట్టి అమృతేష్‌కి ఉద్యోగం తప్పకుండా వస్తుందని ఆశపడింది. కానీ ఇలా జరుగుతుందని ఆమె ఊహించ లేదు.

అమృతేష్‌ని మృతేష్‌గా చేయాలని ఇంకా ప్రయత్నాలు జరుగుతున్నాయా ?
అతని జీవితంలో మరో అధ్యాయం ఎలా ఉండబోతోంది ?
జస్ట్ వెయిట్ ఫర్ సమ్ మోర్ టైమ్ ప్లీజ్.